నమస్తే తెలంగాణ

# జనగామ

5 | బుధవారం 15 మే 2024 | JANAGAON




సోమవారం హనుమకొండలోని వడ్డెపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఓటేసేందుకు బారులు తీరిన ప్రజలు

# అదనం అనుకూలమే!

**మూడు పార్టీల్లో ఎవరి ధీమా వారిదే • గతేడాది కంటే పెరిగిన పోలింగ్ శాతం**

*వరంగల్, మానుకోట లోక్‌సభ స్థానాల పోలింగ్ తుది వివరాలను ఈసీ మంగళవారం వెల్లడించగా 2019 కంటే ఎక్కువ శాతం నమోదైంది. వారాంతం కలిసిరావడం, అంతకు ముందు రోజు జోరువాన కురిసి వాతావరణం చల్లబడడం కూడా ఓటింగ్ శాతం పెరిగేందుకు కారణమైంది. గత ఎన్నికలతో పోల్చితే వరంగల్‌లో అదనంగా 5.16 శాతం(68.86%), మహబూబాబాద్‌లో 2.79శాతం(71.85%) నమోదు కాగా, పోలింగ్ శాతం పెరగడం తమకు అనుకూలంగా ఉంటుందని ప్రధాన పార్టీలు బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల్లో ధీమా వ్యక్తమవుతోంది. ఎవరికి వారు అంచనాలు వేసుకుంటూ గెలుపు తమదేనంటూ విశ్వాసం వ్యక్తంచేస్తున్నారు. కాగా ఐదేళ్ల క్రితం ఈ రెండు చోట్లా బీఆర్‌ఎస్ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధించగా ఈసారి కూడా గులాబీ జెండా ఎగరడం ఖాయమని చెబుతున్నారు.*

- వరంగల్, మే 14
(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

- వరంగల్-68.86%, మానుకోట-71.85%
- లోక్‌సభ పోలింగ్ తుది గణాంకాలు వెల్లడి
- గత ఎన్నికలతో పోల్చితే వరంగల్‌లో 5.16శాతం, మహబూబాబాద్‌లో 2.79శాతం ఎక్కువ
- 2019 ఎన్నికల్లో రెండు చోట్లా బీఆర్‌ఎస్‌దే గెలుపు
- ఈసారి తమదే విజయం అంటున్న బీఆర్‌ఎస్ అభ్యర్థులు

## వరంగల్‌లో 68.86 శాతం

- స్టేషన్‌ఘన్‌పూర్‌లో అత్యధికంగా 78.77శాతం నమోదు
- అత్యల్పంగా వరంగల్ పశ్చిమలో 52.68 శాతం

వరంగల్, మే 14(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ అయిన ఓట్ల వివరాలపై స్పష్టత వచ్చింది. పోలింగ్ వివరాలపై తుది గణాంకాలను కేంద్ర ఎన్నికల కమిషన్ మంగళవారం వెల్లడించింది. వరంగల్ లోక్‌సభ సెగ్మెంట్‌లో 68.86 శాతం పోలింగ్ నమోదైంది. వరంగల్ లోక్‌సభ సెగ్మెంట్‌లో స్టేషన్ ఘన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఈసారి అత్యధికంగా 78.77 శాతం పోలింగ్ నమోదైంది. ఎప్పటిలాగే వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో అతి తక్కువగా 52.68 శాతం పోలింగ్ అయ్యింది. పరకాల అసెంబ్లీ సెగ్మెంట్‌లో 76.86 శాతం, వర్ధన్నపేటలో 72.24 శాతం, భూపాలపల్లిలో 67.71 శాతం వరంగల్ తూర్పులో 65.08 శాతం నమోదైంది.

**2019లో 63.70శాతం**

2019 లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ సెగ్మెంట్‌లో 63.70 శాతం పోలింగ్ నమోదైంది. గత ఎన్నికల కంటే ఈసారి 5.16 శాతం ఎక్కువ పోలింగ్ అయ్యింది. అకాల వర్షంతో వాతావరణం చల్లబడడం ఈసారి పోలింగ్ పెరిగేందుకు ప్రధాన కారణంగా కనిపించింది. యువత, ఇతర ప్రాంతాల్లో ఉండే వారు సొంత ఊర్లకు వచ్చి ఉత్సాహంగా ఓటు వేశారు. పోలింగ్ శాతం పెరగడం ఏ పార్టీలకు ఉపయోగకరంగా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది. ప్రధానంగా పోటీలో ఉన్న మూడు పార్టీల్లో ఎవరికి వారు తమకు అనుకూలంగా ఉంటుందని చెబుతున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ భారీ మెజార్టీతో గెలిచింది. పోలైన ఓట్లలో 58.70 శాతం బీఆర్‌ఎస్‌కు పడ్డాయి. కాంగ్రెస్‌కు 25.10, బీజేపీకి చాలా తక్కువగా 8శాతమే పోలింగ్ నమోదైంది.

**2019లో పోలింగ్ (వరంగల్)**

| | | |
|---|---|---|
| నమోదైన ఓట్లు | : | 63.70 శాతం |
| బీఆర్‌ఎస్‌కు | : | 58.70 శాతం |
| బీఆర్‌ఎస్‌కు కాంగ్రెస్‌కు తేడా | : | 25.10 శాతం |
| బీఆర్‌ఎస్‌కు బీజేపీ | : | 8 శాతం |
| బీఆర్‌ఎస్‌కు ఏహెచ్‌ఎన్‌పీ | : | 2.8 శాతం |
| బీఆర్‌ఎస్‌కు బీఎస్‌పీ | : | 0.8 శాతం |



జడ్పీ క్యాంప్ కార్యాలయంలో పుస్తకం చదువుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్



హనుమకొండ ప్రశాంత్ నగర్‌లోని తన ఇంట్లో టీవీ చూస్తున్న బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్



హనుమకొండ ఎక్సైజ్‌కాలనీలో కుటుంబసభ్యులతో కలిసి పచ్చడి మామిడి కాయలు కోస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య

**వరంగల్ లోక్‌సభ..**

| సెగ్మెంట్ | మొత్తం ఓట్లు | పోలైన ఓట్లు | శాతం |
|---|---|---|---|
| స్టేషన్‌ఘన్‌పూర్ | 254110 | 200158 | 78.77 |
| పాలకుర్తి | 255514 | 182515 | 71.43 |
| పరకాల | 222383 | 170916 | 76.86 |
| వరంగల్ పశ్చిమ | 283446 | 149320 | 52.68 |
| వరంగల్ తూర్పు | 258495 | 168234 | 65.08 |
| వర్ధన్నపేట | 273766 | 197763 | 72.24 |
| భూపాలపల్లి | 276752 | 187395 | 67.71 |
| మొత్తం | 18,24,466 | 12,56,301 | 68.86 |

**మహబూబాబాద్ లోక్‌సభ..**

| సెగ్మెంట్ | మొత్తం ఓట్లు | పోలైన ఓట్లు | శాతం |
|---|---|---|---|
| డోర్నకల్ | 222906 | 168053 | 75.39 |
| మహబూబాబాద్ | 258850 | 184410 | 71.24 |
| నర్సంపేట | 235849 | 180659 | 76.60 |
| ములుగు | 233191 | 162443 | 69.66 |
| పినపాక | 203790 | 141432 | 69.40 |
| ఇల్లందు | 225097 | 158650 | 70.48 |
| భద్రాచలం | 152683 | 105383 | 69.02 |
| మొత్తం | 15,32,366 | 11,01,030 | 71.85 |

## మహబూబాబాద్‌లో 71.85 శాతం..

- గతం కంటే 2.79శాతం ఎక్కువ
- అత్యధికంగా నర్సంపేట.. అత్యల్పంగా భద్రాచలంలో నమోదు

మహబూబాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): మహబూబాబాద్ లోక్‌సభ సెగ్మెంట్‌లో 71.85% పోలింగ్ నమోదైంది. ఈమేరకు తుది గణాంకాలను కేంద్ర ఎన్నికల కమిషన్ మంగళవారం వెల్లడించింది. ఇందులో అత్యధికంగా నర్సంపేట నియోజకవర్గంలో 76.60%, అత్యల్పంగా భద్రాచలంలో 69.02 శాతం పోలింగ్ అయ్యింది. లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో మొత్తం 15,32,366 ఓట్లు ఉండగా, 11,01,030 ఓట్లు పోలయ్యాయి. 2019లో 69.06 శాతం ఓట్లు నమోదు కాగా, ఈసారి 71.85% ఓట్లు నమోదయ్యాయి. గతం కంటే 2.79శాతం ఎక్కువ నమోదు కాగా పెరిగిన ఓటు శాతం ఎవరికి కలిసొస్తుందోనని ఆయా పార్టీలు ఎవరికి వారే లెక్కలు వేసుకుంటున్నారు.



హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లో కుటుంబ సభ్యులతో ముచ్చటిస్తున్న మహబూబాబాద్ బీజేపీ అభ్యర్థి సీతారాంనాయక్




వరంగల్ ఎనుమాముల మార్కెట్‌లోని స్ట్రాంగ్ రూం వద్ద పోలీస్ బందోబస్త్

# ఈవీఎంలు భద్రం

**నాయకుల సమక్షంలో స్ట్రాంగ్ రూంలకు సీల్**
**ఆవరణలోకి ఎవరినీ అనుమతించం**
**వరంగల్ లోక్‌సభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య**

కాశీబుగ్గ, మే 14: వరంగల్ లోక్‌సభ పోలింగ్‌కు సంబంధించి పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్, వరంగల్ తూర్పు, పశ్చిమ, వర్ధన్నపేట, భూపాలపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ల ఈవీఎంలను ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలోని స్ట్రాంగ్ రూంల్లో భద్రపర్చినట్లు ఎన్నికల అధికారి, వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. మంగళవారం స్ట్రాంగ్‌రూంల వద్ద జనరల్ అబ్జర్వర్ బండారు స్వాగత్ రణ్వీర్ చంద్ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఏఆర్వోలతో కలిసి స్ట్రాంగ్ రూంలకు సీల్ వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ స్ట్రాంగ్ రూముల్లో ఎన్నికల సామగ్రిని భద్రపర్చినట్లు తెలిపారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఆయా అసెంబ్లీ సెగ్మెంట్లలో అతి ఎక్కువ, అతి తక్కువ పోలింగ్ జరిగిన కేంద్రాలు, ఈవీఎంలు, రిప్లేస్‌మెంట్ జరిగిన బూత్‌లను స్క్రూటినీ చేశామన్నారు. వరంగల్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో 68.86 శాతం పోలింగ్ నమోదైందన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా నమోదైన శాతం కూడా వెల్లడిస్తామన్నారు. ప్రతి స్ట్రాంగ్ రూంకు ఒక గార్డ్ ఉంటారని, వారితో లాగ్‌బుక్ నిర్వహిస్తామని, స్ట్రాంగ్‌రూం ఆవరణలోకి ఎవరినీ అనుమతించబోమన్నారు. అభ్యర్థులు వారి తరపున వచ్చే ఏజెంట్లకు ప్రత్యేక రూం ఏర్పాటు చేసి, స్ట్రాంగ్ రూంల సీసీ ఫుటేజీలను బిగ్ స్క్రీన్లపై ఏర్పాటు చేసి ప్రదర్శిస్తామన్నారు. అభ్యర్థులు వారి ఏజెంట్లు 24 గంటలు ఆ ఫుటేజీలను చూడొచ్చన్నారు. పోలీసుల సమక్షంలో ఇన్నర్ పెరిమీటర్ వరకు వారి పోలీస్ ఎస్కార్ట్‌తో పరిశీలించొచ్చన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాధికా గుప్తా, ఏఆర్వోలు అశ్విని తానాజీ వాకడే, డీఎస్ వెంకన్న, రోహిత్‌సింగ్, నారాయణ, వెంకటయ్య, మంగీలాల్, సీదం దత్తు, తహసీల్దార్లు, డీటీలు పాల్గొన్నారు.



స్ట్రాంగ్‌రూంల వద్ద వివరాలు తెలుసుకుంటున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

### స్ట్రాంగ్ రూంల వద్ద మూడంచెల భద్రత : సీపీ

వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలోని గోదాముల్లో ఎన్నికల సామగ్రిని భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూంలు ఏర్పాటు చేశారు. ఈ మేరకు మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. ఆయన స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. అనంతరం మరింత భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలపై సీపీ అధికారులతో సమీక్షించారు. మూడంచెల భద్రతతోపాటు ఇప్పటికే 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. 24 గంటలూ సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఆయన వెంట వెస్ట్‌జోన్ డీసీపీ సీతారాం, అదనపు డీసీపీలు సురేశ్‌కుమార్, సంజీవ్, ఏసీపీలు దేవేందర్, అనంతయ్య, సీఐ పులి రమేశ్‌గౌడ్, సతీశ్, ఆర్‌ఐ స్వర్జన్‌రాజ్‌లు ఉన్నారు.

### అందరి సహకారంతో ప్రశాంతం: ఆర్వో



స్ట్రాంగ్ రూములకు సీల్ వేయిస్తున్న ఆర్వో ప్రావీణ్య

ఖిలావరంగల్ : వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో అందరి సహకారంతోనే పోలింగ్ ప్రశాంతంగా జరిగినట్లు ఆర్వో ప్రావీణ్య తెలిపారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించిన జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆమె ఈ సందర్భంగా అభినందించారు. అలాగే, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రచార మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరవేసిన మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

# గెలుపు బీఆర్‌ఎస్‌దే..

- కాంగ్రెస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- ఎన్నికల్లో 'కారు'కే బ్రహ్మరథం పట్టారు
- మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి కవిత
- కేసీఆర్ పాలనలోనే ప్రజలకు లబ్ధి
- మాజీ మంత్రి సత్యవతిరాథోడ్
- రైతులను ఆగం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- ఎమ్మెల్సీ రవీందర్‌రావు




మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత, మాజీ మంత్రి సత్యవతి

మహబూబాబాద్ రూరల్, మే 14 : నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత అన్నారు. మంగళవారం ఆమె మహబూబాబాద్ పట్టణంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, జడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందుతో కలిసి సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలిచ్చి గాలికి వదిలేసిందని ప్రజలు గ్రహించారని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా మళ్లీ అవే హామీలు ప్రకటించడంతో జనం ఆ పార్టీని నమ్మలేదన్నారు. ప్రభుత్వం ఏర్పడిన అతికొద్ది రోజుల్లోనే అన్నివర్గాల ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడిందన్నారు. మానుకోట పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌కు బ్రహ్మరథం పట్టారని, ప్రజల్లో వచ్చిన చైతన్యంతోనే బీఆర్‌ఎస్ భారీ మెజార్టీతో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రెండు నెలలుగా పార్లమెంట్ పరిధిలోని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు విరామం లేకుండా గ్రామాల్లో ప్రచారం చేశారని, సోషల్ మీడియా వారియర్స్, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పాలనలోనే లబ్ధి పొందారని అన్నారు. బీఆర్‌ఎస్ పాలనలోనే తండాలు, గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయన్నారు. ఎమ్మెల్సీ రవీందర్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రజలకు అనేక హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కారు వాటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులను ఆగం చేస్తున్నారని, సాగునీరు అందక సగం పంటలు ఎండిపోయాయన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతోనే ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయకుండా బీఆర్‌ఎస్ వైపే ఉన్నట్లు ధీమా వ్యక్తంచేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, ముత్యం వెంకన్న, గద్దె రవి, చిట్యాల జనార్దన్, రవికుమార్, మంగళంపల్లి కన్న, ఆవుల వెంకన్న పాల్గొన్నారు.



నల్లబెల్లి మండలం మేడెపల్లిలో కూలిన విద్యుత్ స్తంభాలు

# వడగండ్ల బీభత్సం



నల్లబెల్లిలో ధ్వంసమైన ఇంటి పైకప్పు

నల్లబెల్లి/వెంకటాపూర్, మే 14 : వడగండ్ల వానకు వరంగల్ జిల్లా నల్లబెల్లి, ములుగు జిల్లా వెంకటాపూర్ మండలాలు అతలాకుతలమైంది. పలు గ్రామాల్లో గాలిదుమారం బీభత్సం సృష్టించింది. నల్లబెల్లి మండలం గుండ్లపహాడ్, నల్లబెల్లి, కొండాపూర్, ఆసరవెల్లి, లక్ష్మీతండా, మూడుచెక్కలపల్లెలో విద్యుత్ స్తంభాలతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలాయి. అలాగే, రేకుల షెడ్లు ఎగిపోయి ధ్వంసమయ్యాయి. కల్లాలు, రోడ్లపై ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. పలుచోట్ల చెట్లు కూలడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.




వెంకటాపూర్‌లో కల్లంలో ఆరబోసిన ధాన్యంపై వరద నీరు

# ప్రశ్నించే గొంతుకను గెలిపించండి

**వరంగల్-ఖమ్మం-నల్గొండ బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి**
**ఎల్‌ఐసీ, బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయాల్లో ఉద్యోగులకు విజ్ఞప్తి**
**లైబ్రరీలో ఉద్యోగార్థులతో మమేకం**

హనుమకొండ/హనుమకొండ చౌరస్తా, మే 14: వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో తనకు తొలి ప్రాధాన్యత ఓటు వేసి ప్రశ్నించే గొంతుకను గెలిపించాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి కోరారు. ఈమేరకు మంగళవారం ఆయన హనుమకొండలోని ఎల్‌ఐసీ, బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయాల్లో ఉద్యోగులను, జిల్లా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న ఉద్యోగార్థులను కలిశారు. సెంట్రల్ లైబ్రరీలో వారితో మమేకమై ఆయన భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య కుటుంబం నుంచి వచ్చిన తనకు ఉద్యోగుల సమస్యలపై అవగాహన ఉందని, వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పారు. గతంలో ఎమ్మెల్సీగా చుక్కా రామయ్య, ఎల్‌ఎస్ రాజు, ప్రొఫెసర్ నాగేశ్వర్, రాజేశ్వర్‌రావు, దిలీప్‌కుమార్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి అయ్యారని, ఈ తీర్పులు చూస్తే గ్రాడ్యుయేట్స్ ఎవరిని కోరుకుంటున్నారో స్పష్టమవుతోందని అన్నారు. అధికార పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే వారికే ఉపయోగం ఉంటుందని, నిరుద్యోగుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీయలేరని, ప్రతిపక్ష అభ్యర్థిని గెలిపిస్తే అధికారపార్టీని నిలదీయడంతో పాటు సమస్యల పరిష్కారానికి కృషి చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. నాలుగు గోడల మధ్య ఉండి స్క్రీన్ చదివే వ్యక్తిని కాకుండా ప్రజల్లో ఉండే తనను గెలిపించాలని కోరారు. జీవో 46ని రద్దు చేస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీని నెరవేర్చేవరకూ విద్యార్థుల పక్షాన యుద్ధం చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట కార్పొరేటర్ రవినాయక్, బీఆర్‌ఎస్‌వీ నాయకులు కొమురన్న, జెట్టి రాజేందర్, పిన్నింటి విజయ్, తదితరులు ఉన్నారు.



గ్రంథాలయంలో ఉద్యోగార్థులను ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి